
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5 జనగామ

శుక్రవారం 23 ఆగస్టు 2024

రూ.210 కోట్లతో రహదారుల అభివృద్ధి

- జఫర్‌గడ్‌లో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- జఫర్‌గడ్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, ఆగస్టు 22: రూ.210 కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని, నెల రోజుల్లోగా అనుమతులు వస్తాయని అన్నారు. గురువారం ఆయన జఫర్‌గడ్‌లో 85 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద పిల్లలకు ఉచిత నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు గురుకుల పాఠశాలలు ఒకే చోట ఉండేలా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ల (సమీకృత గురుకుల విద్యాలయ సముదాయం) ఏర్పాటుకు నిర్ణయించిందన్నారు. అందులో ఒకటి జఫర్‌గడ్ మండలం తిమ్మంపేట - జఫర్‌గడ్ ప్రధాన రహదారి పక్కన గల 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో నాలుగు లైన్ల బీటీ రోడ్లతో పాటు సాగు నీటికోసం మండల కేంద్రంలోని పెద్ద చెరువును రిజర్వాయర్‌గా ఆధునీకరిస్తామని తెలిపారు. దేవాదుల నీటితో నియోజకవర్గంలోని అన్ని జలాశయాలను నింపి ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అర్హులందరికీ రుణమాఫీకి చర్యలు..

ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ కార్యక్రమం చేపట్టిందని.. ఇప్పటికే 18 వేల కోట్ల వరకు రుణమాఫీ చేసిందని అన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని.. ఇందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే గ్రామపంచాయతీలకు నిధులు, రైతు భరోసా కింద అన్నదాతలకు ఆర్థిక సాయం నిధులను కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాగానే, ఆర్థికంగా కొంత వెసులు బాటు అనంతరం రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శంకరయ్య, ఎంపీడీవో సుమన్, డిప్యూటీ తహసిల్దార్ హరిప్రసాద్, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు భిక్షపతి, బ్రహ్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, నాయకులు బానోత్ రాజేశ్‌నాయక్, ఎడ్ల వెంకటస్వామి, ఎం.నర్సింగం, సిహెచ్.కృష్ణమూర్తి, ఎం.ప్రభాకర్, మంచాల అనిల్, నీలం రాజయ్య, సత్యనారాయణ, కె.సారంగం పాల్గొన్నారు.

డీఏవో వినోద్‌కుమార్ బదిలీ

కొత్త డీఏవోగా రామారావు నాయక్



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావునాయక్

జనగామ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.వినోద్‌కుమార్ బదిలీ అయ్యారు. 2022 ఏప్రిల్ 4న ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లకు పైగా డీఏవోగా పనిచేసిన ఆయనను ప్రభుత్వం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో నకిరేకల్ ఏడీఏగా పనిచేస్తున్న డి.రామారావునాయక్ జనగామకు బదిలీపై వచ్చారు. ఆయన అంతకుముందు సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగానూ పనిచేశారు. కాగా.. డీఏవోగా గురువారం బాధ్యతలు చేపట్టిన రామారావునాయక్ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.



పండ్ల తోటలకు ప్రాధాన్యం

జఫర్‌గడ్ మండలం కూనూరులో డ్రాగన్ పండ్ల తోటలో పని చేస్తున్న కూలీలు

- సాగును ప్రోత్సహించేందుకు సర్కారు సాయం
- మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చుల చెల్లింపు
- 16 రకాల మొక్కల పెంపకం
- చిన్న, సన్నకారు రైతులకే అవకాశం
- జిల్లాలో 600 ఎకరాల్లో సాగు లక్ష్యం





జఫర్‌గడ్, ఆగస్టు 22 : సంప్రదాయ పంటలకు బదులు ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పండ్ల తోటల విస్తీర్ణం పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. ఆసక్తి ఉన్నవారికి సహకారం అందిస్తోంది. పలురకాలుగా రాయితీలను వర్తింపజేస్తోంది. మొక్కల కొనుగోలు దగ్గర నుంచి ఫలసాయం అందే వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చులను ఉపాధి హామీ కింద చెల్లిస్తోంది. అయిదు ఎకరాల లోపు నీటి వసతి కలిగిన భూమి ఉన్న రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవచ్చు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతీ మండలానికి 50 ఎకరాల చొప్పున జిల్లాలోని 12 మండలాలకు కలిపి మొత్తం 600 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధే లక్ష్యంగా...

పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పండ్ల ఉత్పత్తి లేక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పండ్లకు మార్కెట్‌లో నానాటికీ డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు నీటివనరులు సమృద్ధిగా ఉంటూండడంతో ఏటా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల సాగును పెంచేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల ద్వారా రైతులకు సహాయం అందేలా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఐదు ఎకరాల వరకు గల చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పండ్ల తోటల పెంపకానికి చర్యలు చేపట్టారు.

రైతులకు అవగాహన..

గ్రామీణాభివృద్ధి శాఖ నేతృత్వంలో ఉద్యాన, ఉపాధి హామీ శాఖల సహకారంతో వివిధ పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మామిడి, జామ, సపోట, మునగ, చింత, డ్రాగన్ ఫ్రూట్, నారింజ, బత్తాయి, కొబ్బరి, దానిమ్మ, ఆయిల్‌పామ్, నేరేడు వంటి పండ్ల తోటలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలను వంద శాతం రాయితీపై అందిస్తున్నారు. ఈ పథకం కింద ఎంపికైన రైతులకు పండ్ల తోటల సాగుకు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు. భూమి సారాన్ని బట్టి ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు పండ్ల తోటలను ఎంపిక చేస్తారు. మొక్కల పెంపకానికి సంబంధించి గుంతలు తీసేందుకు కూలీలకు డబ్బులు, తోట చుట్టూ కంచె ఏర్పాటుకు, ఎరువుల కొనుగోలుకు రైతులకు సాయం కింద డబ్బులు చెల్లిస్తారు. పంట మొదటి దిగుబడి వచ్చే వరకు సాయం అందిస్తారు.



జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటలో మునగ తోట సాగు చేస్తున్న ఓ రైతు (ఫైల్)

అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి..
వసంత, డీఆర్‌డీవో జనగామ



పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం రైతులకు ఆర్థిక సాయం అందిస్తోంది. సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. పంట దిగుబడి వచ్చే వరకు పర్యవేక్షణతో పాటు మూడేళ్ల వరకు అయ్యే ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుంది. సంబంధిత నగదును రైతు ఖాతాలో జమ చేస్తారు. రూపాయి పెట్టుబడి లేకుండా పండ్ల తోటలను సాగు చేసుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ మండలంలో 50 ఎకరాల చొప్పున వివిధ పండ్ల తోటలు సాగు చేసేలా కార్యాచరణ చేపట్టాం. జిల్లాలో నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం. ఆసక్తి గల రైతులు మండల పరిషత్ కార్యాలయంలో, ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

వివిధ రకాల పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వివరాలు..

పండ్ల తోటల రకం	ఎకరాకు మొక్కల సంఖ్య	పెట్టుబడి సాయం (మూడేళ్లకు కలిపి)
మామిడి	70	రూ. 54,606
నిమ్మ	25	రూ. 69,403
నారింజ	44	రూ. 63,118
జీడి మామిడి	24	రూ. 54,186
జామ	31	రూ. 70,063
సీతాఫలం	26	రూ. 1,00,986
సపోట	37	రూ. 47,264
ఆయిల్‌పామ్	20	రూ. 43,946
నేరేడు	25	రూ. 31,120
ఆపిల్ బేర్	51	రూ. 77,786
దానిమ్మ	24	రూ. 1,21,499
మునగ	15	రూ. 94,892
డ్రాగన్ ఫ్రూట్	40	రూ. 2,50,272
కొబ్బరి	36	రూ. 31,560

రేవంత్‌రెడ్డి నిజస్వరూపం బయటపడింది



జనగామ బీఆర్ఎస్ రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- రుణమాఫీ 50 శాతం కూడా అమలు కాలేదు
- నేరుగా రైతుల వద్దకే వెళ్లి అడుగుదాం
- రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్
- జనగామలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల ధర్నా

జనగామ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి నిజస్వరూపం బయటపడిందని, ఆయన అబద్ధాల, దగాకోర్ సీఎం అని జనాలకు అర్థం అయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతులందందరికీ రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకున్నారని, కానీ 50 శాతం మంది రైతులకు కూడా కాలేదని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జనగామ జిల్లాకేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గురువారం నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ జరగలేదని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, రేవంత్‌రెడ్డి ఏ మండలానికి, ఏ ఊరుకు వస్తారో రావాలని సవాల్ విసిరారు. నేరుగా రైతుల వద్దకే వెళ్లి వంద శాతం రుణమాఫీ జరిగిందో లేదో అడుగుదామని అన్నారు. రుణమాఫీ విషయంలో మంత్రులకే సరైన అవగాహన లేదని విమర్శించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి, భట్టి విక్రమార్క తలో విధంగా రుణమాఫీపై లెక్కలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రైతులందరికీ రుణమాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాల చేస్తూనే ఉంటామన్నారు. రాదనుకున్న తెలంగాణనే తెచ్చిన తమకు రేవంత్‌రెడ్డితో కొట్లాడడం లెక్కే కాదన్నారు. కేసీఆర్ హయాంలో రైతుల కోసం రైతుబంధు పథకం తెచ్చి పెట్టుబడి సాయాన్ని అందించామని, ఇప్పుడు ఎందుకివ్వడం లేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో ఇస్తానన్న రైతుభరోసా రాలేదని, రుణమాఫీ సగం కూడా కాలేదని, జాబ్ క్యాలెండర్ దిక్కేలేదని, సన్నాలకు బోనస్ బోగస్ అయిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ గురించి అసెంబ్లీలో చర్చ పెట్టాలని తాను అడిగితే సీఎం పారిపోయారని ఎద్దేవా చేశారు. ఎల్ఆర్ఎస్ వద్దంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కేసు వేశారని, అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని విమర్శించారు.

రుణమాఫీ జరిగిన రైతులకు డిసెంబరు 9 వరకు వడ్డీ చెల్లించారని, డిసెంబరు 9 నుంచి ఆగస్టు 15 వరకు వడ్డీని రైతులే భరించాల్సి వస్తోందని హరీశ్‌రావు అన్నారు. డిసెంబరు 9నే మాఫీ చేస్తే ఈ 8 నెలల వడ్డీ రైతులపై పడేది కాదు కదా అని నిలదీశారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లపై ఒట్టేసి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి పాప పరిహారం చేసుకోవాలని హితవు పలికారు. అన్ని గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల జాబితాలను సిద్ధం చేయాలని హరీశ్‌రావు బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు ఇస్తే అసెంబ్లీని స్తంభింపచేస్తానని అన్నారు.

రేవంత్‌రెడ్డిది తిట్ల పురాణం: పల్లా

రుణమాఫీ గురించి అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల పురాణం అందుకుంటున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని, ఆయనకు కనీస విలువలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను తిట్టినా పట్టించుకోమని, కానీ ప్రజలకు ఏం హామీలు ఇచ్చారో ఆలోచన చేసుకోవాలని హితవు పలికారు. రుణమాఫీ చేస్తానని ఊరించి కనీసం 40 శాతం మందికి కూడా చేయలేదని అన్నారు. తమ హయాంలో ఎలాంటి షరతులు పెట్టకుండా రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దేవీ ప్రసాద్, ఎనుగుల రాకేశ్‌రెడ్డి, జనగామ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు బక్క నాగరాజుయాదవ్, సేవెల్లి సంపత్, బాల్దె సిద్ధిలింగం, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, ఇర్రి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలే తప్ప ఆచరణ శూన్యం



స్టేషన్‌ఘన్‌పూర్ డీసీసీబీ ఎదుట నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

- రుణమాఫీ విషయంలో మాట తప్పిన సీఎం
- బీఆర్ఎస్ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 22: కాంగ్రెస్ పాలనలో హామీలే తప్ప ఆచరణ శూన్యమని మాజీ ఎమ్మెల్యే రాజయ్య విమర్శించారు. బేషరతుగా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ డీసీసీబీ ఎదుట బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 62 లక్షల మందికి ఏకకాలంలో రుణమాఫీ చేస్తా నని చెప్పిన రేవంత్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను మోసం చేశాడని అన్నారు. రేవంత్ క్యాబినెట్‌లో అవగాహన లేని మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రైతులకు 24గంటల కరెంట్ ఇస్తే రేవంత్ కోతలు పెడుతున్నారని, ఆయన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. రైతు భరోసా లేదు, తులం బంగారం లేదు, మహిళలకు 2500 నగదు లేదు, పెన్షన్ల పెంపు లేదు అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిన మున్సిపాలిటీ ఏర్పాటు, 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు కడియం శ్రీహరి అడ్డుపడ్డాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన ఒక్క పని కూడా చేయలేద న్నారు. నియోజకవర్గంలో రిజర్వాయర్లు పూర్తిగా ఎండిపోయాయని, నీటిపారుదలపై సమీక్ష నిర్వహించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల మద్దతు పొందుతామని అన్నారు.

కార్యక్రమంలో జడ్పీ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, మాజీ సర్పంచ్ జక్కుల పరుశరాములు, నాయకులు ఆకుల కుమార్, నర్సింహరెడ్డి, మహేందర్ రెడ్డి, అక్కెనపల్లి బాలరాజు, గంగుల శ్రీనివాస్ రెడ్డి, ముక్కెర రాజ్‌కుమార్‌యాదవ్, సురేష్‌కుమార్, మల్లేషం, చందర్ రెడ్డి, కనకం గణేష్, అకారపు అశోక్, మాతంగి దేవయ్య, మారపల్లి ప్రసాద్, జోగు లింగస్వామి, ముక్కెర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడారు. రాష్ట్ర రైతాంగానికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రుణమాఫీ నిధుల విడుదల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రుల ప్రకటనలకు పొంతనే లేదన్నారు. వర్షాకాలం సీజన్ ముగుస్తున్నా చెరువుల్లో నీళ్ళు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. సమ్మక్క, సారక్క బ్యారేజీలో పుష్కలంగా నీళ్ళున్నా, వాటిని రిజర్వాయర్లకు మళ్ళించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన 8 నెలల కాలంలో నియోజకవర్గానికి ఎమ్మెల్యే కడియం చేసింది శూన్యమన్నారు. అనంతరం తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ విషయంలో సమస్యల పరిష్కారంపై స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ గోపిరాజుతో మాట్లాడారు.

బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ జనగామ యాదగిరి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏడవెళ్లి కృష్ణారెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, పల్లా యువసేన వ్యవస్థాపకుడు కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నారగోని రవిచంద్ర, నాయకులు రంగు హరీష్, మోటం రాములు, వెన్నం మాధవరెడ్డి, మంతెన రాజు, అలుగు అశోక్, బబ్బుల వంశీ, ఎడ్ల శ్రీనివాస్, రాజేష్, ఉడుత అశోక్, రంగు రవి, గుంటి భీముడు, మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

- లోక్‌సభ ఎన్నికల్లో నైతికంగా ఓడిన బీజేపీ
- అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు
- నితీష్, చంద్రబాబు ఊతకర్రల సాయం ఎంతకాలం?
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర సమావేశాలు

వివరాలు 7వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా

ఆస్పత్రుల్లో కలెక్టర్ తనిఖీలు

- రోజూ నివేదిక పంపించాలని అధికారులకు ఆదేశాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



జిల్లా ఆసుపత్రిలో పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రితో పాటు చంపక్‌హిల్స్‌లోని మాతా శిశు సంక్షేమ కేంద్రాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం సందర్శించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'జ్వర పంజా' కథనానికి స్పందించిన ఆయన ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో చేరినప్పుడు ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో న్యూట్రిషనిస్ట్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రెండు సార్లు డాక్టర్లు పేషెంట్‌ను పరీక్షించాలని ఆదేశించారు. రోగులకు సంబంధించి రోజువారీగా తనకు నివేదిక సమర్పించాలన్నారు. ఎంత మంది అడ్మిట్ అవుతున్నారు, డిశ్చార్జ్ అవుతున్నారనే విషయాలను తనకు నివేదిక రూపంలో అందించాలన్నా రు. డెంగీ, మలేరియా వంటి జ్వరాల వల్ల ఏ ఒక్క పేషెంట్ ప్రాణానికి ముప్పు రాకుండా జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. జిల్లాలో మందులకు ఎలాంటి కొరత లేదని, అవసరమైతే ప్రైవేటుగా మందులు కొని పేషెంట్లకు వైద్యం అం దించాలని అన్నారు. ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులపై మరింత దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. చికిత్స పేరిట పేషెంట్ల నుంచి ఎక్కువ మొత్తంలో నగదు వసూలు చేయొద్దని హెచ్చరించారు. ఆయన వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ మధుసూదన్ ఉన్నారు.

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు చేయండి..

జనగామ రూరల్: గవర్నర్ పర్యటనకు పకడ్బందీ గా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. ఈనెల 29న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జనగామకు వస్తున్నందున గురువారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గవర్నర్ పర్యటన సందర్భంగా రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని. ఫాగింగ్ చేయాలని, రూట్ మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై నోట్స్ సమర్పించాలని, పెంబర్తి హస్తకళలపై కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయా లని కోరారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడలని అన్నారు. సమా వేశంలో ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, జడ్పీ సీఈవో సరిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక



- ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో సమావేశం
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న జిష్ణుదేవ్‌వర్మ
- జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్లు

వివరాలు 7వ పేజీలో

వ్యవసాయ శాఖలో అధికారుల బదిలీలు

బాలసముద్రం, ఆగస్టు22: హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖలో అధికారులు బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలతో మల్టీజోన్-1పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు సాధారణ బదిలీలు అయినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనారాయణ మహబూబాబాద్ నుంచి హనుమకొండ ఏడీఏగా, హనుమకొండ ఏడీఏగా పని చేసిన కె.దామోదర్‌రెడ్డి నర్సంపేటకు బదిలీ అయ్యారు. అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోలుగా అఫ్జల్‌పాషా, భీమదేవరపల్లి నుంచి హనుమకొండకు బదిలీ కాగా, బి.మాధవి హనుమకొండ నుంచి దుగ్గొండికి బదిలీ అయ్యారు. కాజీపేట ఏవోగా పని చేసిన శ్రీధర్‌రెడ్డి హనుమకొండ అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోగా వచ్చారు. భీమదేవరపల్లి ఏవోగా రాజేష్, నూతన మండలం వేలేరు ఏవోగా లలిత, ఐనవోలు ఏవోగా సీహెచ్. సునీల్‌కుమార్, నడికూడ ఏవోగా పోరిక జైసింగ్, దామెర ఏవోగా రాకేష్‌లు బదిలీలపై వచ్చినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్, హనుమకొండ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా జి.సంగీత నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీనివాసరావు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అధికారిగా చెరల రాకేష్ తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు మీసేవ, టీఎస్‌ఆన్‌లైన్ తదతర కేంద్రాల ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. ఆగస్టు 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, సెప్టెంబర్ 4 వరకు రూ. 25 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 9 వరకు రూ. 50 అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

బాలసముద్రం, ఆగస్టు 22: వరంగల్ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం నుంచి నూతనంగా నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి భూపాలపల్లి, ఏటూరునాగారం, కాళేశ్వరం రూట్లలో సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీ డీలక్స్ రూ.110, డీలక్స్ రూ.110, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190 కాగా, బస్సు ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరు టికెట్ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

● జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం ● తెలంగాణలో సీపీఐకి ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి
● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ● ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ఆరోపించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణసమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మోదీ విధానాలను తూర్పారబట్టారు. మోదీ అండదండలతో కార్పొరేట్ శక్తులు దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసేలా ఉందన్నారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలు ఆ బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రతిఫలించలేదని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, తదితర కీలక రంగాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే ఏ చర్యను బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోందని, పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రూపాయి విలువ దారుణంగా పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదానీ, అంబానీ అక్రమాలపై విచారణ జరపాలని డి.రాజా డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపులో సెబీ చైర్మన్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దీనిపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ చైర్మన్‌తో రాజీనామా చేయించాలన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించింది గెలుపుకాదని, ప్రజల ఆ పార్టీని నైతికంగా ఓడించం ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. 400 స్థానాలతో అధికారంలోకి వస్తామని ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే చెప్పిన మోదీ.. 250లోపు సీట్లకే పరిమిత మయ్యారన్నారు. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఊతకర్రల సాయంతో కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ ఇద్దరి మద్దతు ఎంతకాలం ఉంటుందనేది పెద్ద ప్రశ్న అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని మోదీ చెబుతున్నా.. ప్రజలకు రేషన్ ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఇంకా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశంలోని నిరుపేదల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, ఇది దేశ వ్యాప్త సమస్య అని, వారందరికీ కార్డులు ఇచ్చే దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

పశ్చిమ బెంగాల్‌లో ఒక మెడికో విద్యార్థినిపై అత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతున్నా..మోదీ మౌనం వీడడం లేదని రాజా పేర్కొన్నారు. దేశంలో మహిళలపై దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్నవారికి రక్షణ కోసం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌ను మోదీ అంగీకరించడం లేదని రాజా ఆరోపించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోందని, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ఈ భావనకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు భిన్నంగా ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే మతం వంటి నినాదాలతో మోదీ ప్రభుత్వం విచ్ఛినకర పాలనను సాగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బ్యూరోక్రసీలోకి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న ఆవేదన ఆయన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగాన్ని తేవడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని రాజా అన్నారు. నిత్యం రామజపం చేసే బీజేపీకి రాముడు జన్మించిన ప్రదేశంలోనే ప్రజలు ఓటుతో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాల పట్ల జమ్మూ కశ్మీర్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అక్కడ శాంతి భద్రతలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదుల మారణకాండ కొనసాగుతూనే ఉందన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, జర్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి పునారావృతం అవుతుందని రాజా జోస్యం చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో మోదీ దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. వినేష్ పొగట్ ఒలంపిక్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చేవారని, బీజేపీ అనుసరించిన విధానాల వల్లే పతకం జేజారిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటికావాలని రాజా పిలుపు నిచ్చారు. ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లను పెంచుకోవడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా నిలబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తానని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కొద్దినెలలే అయినందువల్ల వేచిచూస్తున్నామన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సృష్టించిన సంక్షోభం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బయటపడలేకపోతోందన్నారు. రుణమాఫీ వంద శాతం అమలు కాలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవద్దని కోరుకుంటున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగని పక్షంలో పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, బీజేపీని నిలువరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో లోతుగా చర్చించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కౌన్సిల్ నిర్మాణ సమావేశాలను పూర్తి చేసుకున్నామన్నారు. డిసెంబర్ 25నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఒక క్రియాశీల, మిలిటెంట్ పార్టీగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, సీపీఐ నాయకుడు అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డి.రాజా సమావేశాల ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రకార్యవర్గం సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించింది.



హనుమకొండలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు

అట్టహాసంగా సీపీఐ సమావేశాలు ప్రారంభం

హాజరైన సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ
విడతల వారీగా సమావేశాలు నిర్వహించిన నేతలు

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై ప్రస్తుత రాజకీయాలు, పార్టీ బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు హరిత హోటల్‌కు చేరుకున్న జాతీయ నాయకులకు జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సీపీఐ జెండాను రాష్ట్ర నాయకులతో కలిసి ఎగురవేశారు. అనంతరం హరితహోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో మొదటగా రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యు లు 11 మందితో, సమావేశం నిర్వహించారు. తరువాత 31 మంది ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 137 మంది స్టేట్ కౌన్సిల్ మెంబర్‌లతో జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు నారాయణ, చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని పార్టీ నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తేనే పార్టీ బలోపేతం

నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించినప్పుడే కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం సీపీఐ పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిధ రాష్ట్రాలలో మరణించిన సీపీఐ నాయకులు, వామపక్ష ప్రజాస్వామ్యవాదుల చిత్రపాటలకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ నాయకులకు వివరించారు. ఈనేపథ్యంలో పెట్టుబడిదారీ శక్తులకు దీటుగా కమ్యూనిస్టులు పని చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయాలని కమ్యూనిస్టు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్ల వెంకటరెడ్డి, తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, కలవేని శంకర్, వీఎస్ బోస్, బాల మల్లేశ్, బాల నరసింహాలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు



డి.రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినయభాస్కర్

సీపీఐ నేతలను కలిసిన వినయభాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 22: హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావులను హనుమకొండలోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలకు హాజరైన జాతీయ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడికి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరై జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ హనుమకొండలో చాలాసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు జాతీ య నాయకులకు కూనంనేని సాంబశివ రావు పరిచ యం చేశారు. అనంతరం వినయ్ భాస్కర్‌తో ఎమ్మెల్యే కూనంనేని సరదాగా మాట్లాడుతూ.. మీరు చేసుకున్న అపకారమే మీ ఓటమికి కారణాలని అనగా.. వినయ్‌భాస్కర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కాగా సీపీఐ జాతీయ నాయకులను వినయ్ భాస్కర్ కలవడంపై పలువురు ఆసక్తిగా చర్చించుకున్నారు.

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన

వరంగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు ఓరుగల్లులోని అనేక చరిత్రాత్మక కట్టడాలు, లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులతో పాటు కవులు, కళాకారులు, రచయితలతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అలాగే పలువురిని సన్మానించనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

● 27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు గవర్నర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 8గంటలకు భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుంటన్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి ములుగు జిల్లా కలెక్టరేట్‌కు 11.30గంటలకు చేరుకుంటారు. 12గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం ఉంటుంది. అప్పటి నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని గణపేశ్వరాలయంను సైతం గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్దకు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

● 28వ తేదీ బుధవారం ఉదయం లక్నవరం అందాలను ఆస్వాదిస్తారు. ఆపై ఉదయం 8గంటలకు లక్నవరం నుంచి బయలుదేరి 9.15గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.45వరకు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 10గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేరుకుంటారు. 11.05గంటల నుంచి 12.05గంటల వరకు ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 2.30గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందినవారితో గవర్నర్ పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షి గుడితోపాటు నగరంలోని ఇతర ముఖ్యమైన ప్రదేశాలను గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 6.40గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

● 29వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జనగామ జిల్లాకు బయలుదేరి వెళతారు. 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.11.15గంటల వరకు అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.35గంటలకు ఒబుళాకేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందినవారితో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు ఒబుళాకేశ్వాపూర్ నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రోడ్డు మార్గాన బయలుదేరి భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లనున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

నీటి పారుదల శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బాలసముద్రం, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలోపు సాగునీటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కాల్వల పనులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్ట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. జనగామ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడకుండా గోదావరి జలాలను పంటలకు అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తితో పాటు గండి రామారం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతరత్రా పనులను గుర్తించి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లోగా సమగ్రమైన నివేదిక అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీఈ అశోక్, వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు ● రూ.1కోటి 34లక్షలు టోకరా ● వివరాలు వెల్లడించిన సుబేదారీ సీఐ సత్యనారాయణ

బాలసముద్రం, ఆగస్టు 22: వివిధ రాష్ట్రాలలో నకిలీ ప్రెస్‌కార్డులు, సీబీఐ కార్డులు చూపించి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గురువారం సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిమిత్ కెపాసి (అలియాస్) అమిత్‌కుమార్ (47), సమన్ కాపాసి (అలియస్)కాసోజు జయ(42) ఇద్దరూ కలిసి వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో ఇతర రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డారు. అమిత్ కుమార్ 2023లో హనుమకొండ జులైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌లను పరిచయం చేసుకొని వారికి తన కంపెనీలో ఉద్యోగం ఇచ్చాడు. అదే విధంగా మరికొంత మంది యువకులను నియమించుకుని వారి అకౌంట్ నెంబర్లకు అమిత్‌కుమార్ సెల్ నంబర్ జత చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తన కంపెనీ సిబ్బంది వసూలు చేసిన డబ్బులను వారి అకౌంట్‌లో వేసుకుంటే అమిత్‌కుమార్ అకౌంట్‌కు డబ్బులు వచ్చే విధంగా మార్చుకుని అమాయకులను మోసం చేశాడు.



సుబేదారి పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్, హైదరాబాద్, పూణే, విశాఖపట్నం నగరాలలో పలు కంపెనీలైన స్పీకింగ్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్, మాట్రీ మోని, ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్, తదితరు కంపెనీలలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారు. హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పాన్ కార్డు అడ్రస్‌లు మార్చి నిందితులు మోసాలకు పాల్పడుతూ సుమారు రూ.1కోటి 34లక్షలు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని గురువారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇలాంటి మోసాలు చేసే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు మంచి ధర

గరిష్ఠంగా క్వింటాకు రూ.2,821

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలకని గరిష్ఠ ధర క్వింటాకు రూ.2,821 పలికింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన చిలుముల మొగిలి 33 బస్తాల మొక్కజొన్నలను మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువచ్చాడు. మాధవి ట్రేడర్స్ అడ్తీ ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,821 చొప్పున ఖరీదు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు చిలుముల మొగిలి మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కలకు ఆశించిన ధర పలికినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినందుకు గిట్టుబాటు ధర పలికితే యువకులందరు ఉద్యోగాల కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువే సంపాదించవచ్చని అన్నారు.

సబ్‌స్టేషన్‌లను ప్రొటెక్షన్ టీమ్‌లు తనిఖీ చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 22: ప్రొటెక్షన్ టీమ్‌లు నిత్యం సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, యంఆర్‌టీ, టెక్నికల్ డీఈలతో గురువారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని సూచించారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. లోడ్ ఎక్కువ ఉన్న చోట కెపాసిటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో సిబ్బంది నైపుణ్యత పెంచడానికి శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మధుసూదన్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ఆలస్యంగా వెలుగులోకి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం

రాంనగర్, ఆగస్టు 22: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడం సాధ్యం కాదనే ఆరోపణలున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు గత ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. నాన్ లేఅవుట్ ప్లాట్లు, పార్ట్, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయకూడదనే నిబంధనలు పొందుపరిచింది. ఈ నిబంధనలను బుట్టదాఖలు చేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు డబ్బులు దండుకుంటూ మహబూబాబాద్, పరకాల సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి అడ్డంగా దొరికిన సంఘటనలు సైతం ఉన్నాయి.

కాగా, ఈ సంఘటనలు జరుగుతుండగానే ఖిలా వరంగల్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలు విస్మరించి పలు రిజిస్ట్రేషన్‌లు చేసి అందినంత దండుకున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు పదుల సంఖ్యలో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బొల్లికుంటలో వెలిసిన ఒక నాన్ లేఅవుట్ వెంచర్‌కు సంబంధించిన 40కి పైగా రిజిస్ట్రేషన్‌లు కిందటేడు నెలాఖరున జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఒకే రోజున జరిగినవి కాగా, మిగతా రోజుల్లో చాలానే జరిగినట్లు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ గజానికి రూ.200 చొప్పున డబ్బులు దండుకుని నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఇక వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంటకు చెందిన నాన్ లేఅవుట్ 30కి పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. మూడు మాసాల్లో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లకు సైతం సదరు సబ్ రిజిస్ట్రార్ గజాల లెక్కన వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరు వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులపై గతంలో సైతం పలు ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లాను వీడిన వీరి బాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



బైక్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 22: వివిధ ప్రాంతాల్లో ఆరు బైక్‌లను చోరీ చేసిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. చిలుపూరు మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన బండ శ్రీకాంత్, శివరాత్రి ప్రవీణ్ అనే ఇద్దరు యువకులు వేరు వేరు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించి తీసుకొస్తుండగా ఘన్‌పూర్ రైల్వే అండర్‌పాస్ సమీపంలో సీఐ వినయ్‌కుమార్ పట్టుకున్నారు. వారిని విచారించగా ఒకటి సికింద్రాబాద్‌లో, మరొకటి ఛాగల్ గ్రామంలో దొంగిలించినట్లు తెలిపారు. గతంలో మడికొండలోని బోడగుట్ట వద్ద ఒక బైక్, కాజీపేట రైల్వే స్టేషన్‌లో రెండు బైక్‌లు, నల్లగొండ జిల్లాలోని నూతనకల్‌లో ఒక బైక్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. మొత్తం 6బైక్‌లను చోరీ చేయగా అందులో నాలుగు బైక్‌లను జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన కొత్త వినోద్‌కుమార్ అనే వ్యక్తి వద్ద కుదువపెట్టినట్లు తెలుపగా వాటిని సైతం తెప్పించారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణు తెలిపారు.

వడ్డిచర్లలో గంజాయి విక్రయదారుడి అరెస్ట్..



నిందితుడిని చూపుతున్న ఏసీపీ భీమ్‌శర్మ

లింగాలఘణపురం, ఆగస్టు22: మండలంలోని వడ్డిచర్ల గ్రామానికి చెందిన సాతెల్లి కార్తీక్ అనే యువకు డు గంజాయి సరఫరా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. స్టేషన్‌ఘన్ పూర్ ఏసీపీ భీమ్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ అనే యువకుడు గంజాయి సేవిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు వడ్డిచర్లకు చేరుకుని కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 75 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నవాబుపేటకు చెందిన తన స్నేహితుడు బొల్లంపల్లి మణికంఠ ద్వారా గంజాయి అలవాటు చేసుకొని ఆ తర్వాత తన తల్లిదండ్రులు తనను హైద్రాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ దూల్‌పేటలో మరో వ్యక్తివద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. పూర్తి స్థాయి విచారణ అనంతరం కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఏసీపీ తెలిపారు. మీడియా సమావేశంలో ఏసీపీతో పాటుగా జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

హాజరు శాతం తక్కువైతే చర్యలు: డీఈవో

బచ్చన్నపేట, ఆగస్టు 22: పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉంటే ఇకపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని డీఈవో కె.రాము హెచ్చరించారు. అలాగే ఉపాధ్యాయులు సైతం ఇష్టారీతిన సెలవులు పెట్టకూడదని సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలతో పాటు, చిన్నరామన్‌చర్ల ప్రాథమిక పాఠశాల, పడమటికేశ్వాపూర్, కొన్నె పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయుల్లో ఒకేసారి సగానికి పైగా సెలవలు తీసుకుంటే పాఠశాల నడవటం కష్టమవుతుందన్నారు. అత్యవసర పరిస్థితి మినహా, ఒకరోజు ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. పాఠశాల కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించాలన్నారు. హాజరుశాతం ఎందుకు తగ్గుతోందని నోడల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ద్వారా ఆరా తీశారు. మెరుగైన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంపై ఫిర్యాదులు అందితే చర్యలుంటాయన్నారు. కాగా హాజరుశాతం తక్కువ నమోదు కావటంపై కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని ఎనమిది మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.



రఘునాథపల్లి ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



లింగాలఘణపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



బచ్చన్నపేట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకుల ధర్నాలు

లింగాలఘణపురం, ఆగస్టు 22: ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లింగాలఘణపురంలో ఏపీజీవీ బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జనగామ-మోత్కూరు రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చిట్ల ఉపేందర్‌రెడ్డి, సేవెల్లి సంపత్, బస్వగాని శ్రీనివాస్, గండి యాదగిరి, ఊడ్గుల భాగ్యలక్ష్మి, దుంబాల భాస్కర్‌రెడ్డి, ఎడ్ల రాజు, గాదెపాక విష్ణు, బోళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, లేదంటే రైతులకు క్షమాపణలు చెప్పి గద్దె దిగిపోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, నాయకులు చంద్రారెడ్డి, నరేందర్, కొండి వెంకట్‌రెడ్డి, కల్లూరి అనిల్‌రెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, కోడూరు శివకుమార్, మధుప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సిద్దారెడ్డి, కనకయ్యగౌడ్, మల్లారెడ్డి, అంజనేయులుగౌడ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వారాల రమేష్, ముసిపట్ల విజయ్, కావటి రాజయ్య, దుర్గాప్రసాద్, సత్తయ్య, కొంరయ్య, రాజు, నర్సయ్య, యాదగిరి, శ్రీకాంత్, మడ్లపల్లి రాధాకృష్ణ, కావటి రవి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జఫర్‌గఢ్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు ఎదుట బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జయపాల్‌రెడ్డి, కడారి శంకర్, గబ్బెట బుచ్చయ్య, ఎండి.నజీర్, యార సోమిరెడ్డి, ఆకారపు యాకయ్య, నరేశ్, కె.కుమార్, వేల్పుల యాదగిరి, మేరుగు రమేశ్, గబ్బెట కొమురయ్య, మహిపాల్‌రెడ్డి, ఎస్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మాజీమంత్రి ఎర్ర బెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తొర్రూరులో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. రుణ మాఫీ మొత్తానికి రూ.49,500 కోట్లు అవసరమని చెప్పి.. మాట మార్చి రూ.31వేల కోట్లు సరిపోతాయని బడ్జెట్‌లో కేటాయించి మూడువిడతల వారీగా రూ.17వేల కోట్లు రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందన్నారు. వెంటనే రాష్ట్రంలో రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాకతీయ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌లతో మాట్లాడి రైతులకు ఎంత మేర రుణమాఫీ అయిందో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సోమేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, తూర్పాటి అంజయ్య, రామిని శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు.



తొర్రూరులో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 'సుశీలమ్మ' ఆశ్రమం

జనగామ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జనగామ మెడికల్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ కోసం జనగామ మండలం శామీర్‌పేటలోని కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమంలో కొంత భాగాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెడికల్ కాలేజీ మొదటి సంవత్సరం తరగతులు గతేడాది నుంచి ప్రారంభం కాగా ఈ అక్టోబరులో రెండో సంవత్సరం కూడా ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థినుల హాస్టల్‌ను జిల్లాకేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల హాస్టల్‌లో గతేడాది నుంచి నిర్వహిస్తూ వస్తున్నారు. ఆ హాస్టల్‌లో 70 మంది విద్యార్థినులు ఉండగా ఈ ఏడాది కౌన్సిలింగ్ పూర్తయితే మరో 70 మంది విద్యార్థినులు వస్తారు. వారికి హాస్టల్ వసతి కల్పించే విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా చంపక్‌హిల్స్‌లోని మెడికల్ కాలేజీకి దగ్గర్లోనే ఉన్న కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమంలో కొంత భాగాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా వృద్ధులకు కూడా వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే శాశ్వత భవనాలు అందుబాటులోకి రానున్నాయి.



కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశ్రమం

సీజేఐటీలో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కామెల్ ఇనిస్టిట్యూట్ అధినేత మురళీధర్

జనగామ రూరల్, ఆగస్టు 22: యశ్వంతపూర్ క్రీస్తుజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీజేఐటీ)లో గురువారం బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామెల్ ఇనిస్టిట్యూట్ అధినేత డి.మురళీధర్ హాజరై విద్యార్థులకు నైపుణ్యం, జ్ఞానం, ఉద్యోగం కోసం కావలసిన సాఫ్ట్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, నడవడికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



రవిచందర్ (ఫైల్)

చిలుపూర్, ఆగస్టు 22: అనారోగ్యానికి తోడు ఆర్థిక సమస్యలు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, కాజీపేట రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సాయిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.... జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణ పరిధిలోని కేసీఆర్ కాలనీకి చెందిన మిరియాల బాబూరావు - పద్మ దంపతులకు ఇద్దరు కుమారులతో పాటు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్దవాడైన మిరియాల రవిచందర్ స్థానికంగా చిన్న చితకా కాంట్రాక్టు పనులు చేపడుతుండేవాడు. ఏడాది కాలంగా ఆర్థిక సమస్యలు తలెత్తడంతో పాటు ఆనారోగ్యం కారణంగా ఇబ్బంది పడుతున్నాడు. ప్రశాంతత కోసం 8 నెలలుగా కరుణాపురంలోని ఓ చర్చిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం వంగాలపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముంబాయిలో నష్కల్ యువకుడి మృతి



వినయ్‌కుమార్ (ఫైల్)

చిలుపూర్, ఆగస్టు 22 : నష్కల్ గ్రామానికి చెందిన యువకుడు వడ్లకొండ వినయ్‌కుమార్ (30) ముంబాయిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. తల్లిదండ్రులు వడ్లకొండ శంకర్-మణెమ్మ తెలిపిన వివరాల ప్రకారం... ఏడాది క్రితం బతుకుదెరువు కోసం తను స్నేహితులతో కలిసి ముంబాయికి వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు అక్కడి నుంచి సమాచారం వచ్చింది. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

పత్తి సాగుపై రైతులకు అవగాహన



రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త ఉమారెడ్డి

పాలకుర్తి, ఆగస్టు 22: పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణ కోసం సస్యరక్షణ చర్యలు పాటించాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు ఉమారెడ్డి సూచించారు. గురువారం ఈరవెన్ను గ్రామంలో రైతులకు పత్తి పంటపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ ఈ సమయంలో గులాబి రంగు పురుగు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. రైతులు విత్తిన 45 రోజుల నుంచి గులాబి రంగు పురుగు ఉనికిని గమనించడానికి లింగాకర్షక బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఉచితంగా లింగాకర్షక బుట్టలను రైతులను పంపిణీ చేశారు. సమావేశంలో ఏడీఏ పర్శరాం, వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, రాజు, చక్రపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఎల్‌వో యాప్‌పై అవగాహన సదస్సు

కొడకండ్ల, ఆగస్టు 22: స్థానిక ఎన్నికల దృష్ట్యా బూత్ స్థాయి అధికారులకు బీఎల్‌వో యాప్‌పై మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం మాస్టర్ ట్రైనర్ అందె సుధాకర్ అవగాహన కల్పించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఓటరు జాబితాలో చేయాల్సిన సవరణలను బీఎల్‌వో యాప్‌లో నమోదు చేయాల్సిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో చంద్రమోహన్, రెవెన్యూ సిబ్బంది బలరాం, అనిల్ రమేశ్, నాగమణి, ఎండీ సోనీ, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఏఎంవో తనిఖీ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ కేజీబీవీ, మోడల్ స్కూల్‌ను జిల్లా ఏఎంవో బి.శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల్లో కనీస అభ్యసనా సామర్థ్యాలు పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న నాస్, ఉన్నతి కార్యక్రమాలను అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 3,6,9 తరగతుల విద్యార్థులకు నవంబర్‌లో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష కోసం విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో విద్యార్థుల గ్రేడ్‌లు పెరిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే ఉన్నతి అభ్యసనాభివృద్ధికి కార్యక్రమం 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు అమలు చేయాలన్నారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు యూనిట్ ప్లాన్, లెసన్ ప్లాన్ ప్రకారం బోధిస్తూ చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు సాధన చేయించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో శ్రీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా మోడల్ స్కూల్, యూపీఎస్ నమిలిగొండ పాఠశాలను శివునిపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.రమేశ్ తనిఖీ చేశారు. తరగతుల్లో బోధనాభ్యసనా సరళిని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా రవి కుమార్

జనగామ రూరల్, ఆగస్టు 22: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జనగామకు చెందిన దడిగే రవి కుమార్ యాదవ్ నియమకం అయ్యారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ గురువారం ఒక ప్రకటన ద్వారా ఈ విషయం తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మట్లాడుతూ బీజేపీ పిలుపుమేరకు రవికుమార్ క్రియాశీలకంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ గుర్తింపు తెచ్చుకోవడంతో సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించామన్నారు. రానున్న రోజుల్లో పార్టీకి మరిన్ని సేవలు అందించాలని సూచించారు. అనంతరం రవి కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను తప్పకుండా నేరవేరుస్తానన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'కళాకారుల కృషి అభినందనీయం'

జనగామ రూరల్, ఆగస్టు 22: జానపద కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా పౌరసంబంధాల అధికారి(డీపీఆర్‌వో) శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డీపీఆర్‌వో కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢనమ్మకాలు, గుడంబా, గుట్కాను పారద్రోలేందుకు, ప్లాస్టిక్ పెనుభూతులను తరిమికొట్టేందుకు జానపద కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. జానపద సాంస్కృతిక కళలు, కళారూపాలు మానవ శ్రమ నుంచి పురుడు పోసుకొని మానవ వికాసానికి ఉపయోగపడుతాయన్నారు. సాంస్కృతిక కళలనే వృత్తిగా చేసుకొని కొందరు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ కళారూపాలను వారే సజీవంగా కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో రేణుక, లక్ష్మీనారాయణ, సంపత్, రమేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్, ఆగస్టు 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ధర్మకంచ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం మినీ స్టేడియంను సందర్శించి ఇండోర్ స్టేడియంలో ఖేలో ఇండియా నిర్వహణ కోసం కల్పించనున్న సౌకర్యాలను పర్యవేక్షించారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

పేద విద్యార్థికి పొన్నాల ఆర్థిక సహాయం



భూక్య వెంకన్నకు నగదు అందిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్

నర్మెట, ఆగస్టు 22: మండలంలోని లోక్యతండాకు చెందిన పేద విద్యార్థి భూక్య వెంకన్నకు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పొన్నాల ఫౌండేషన్ ద్వారా అందించిన రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం జనగామ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, ఎండీ మజీద్, సౌడ మహేష్ అందించారు. భూక్య వెంకన్న చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. జనగామలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకొని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. పై చదువుల కోసం పరీక్ష రాసి ఢిల్లీలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సీటు సాధించాడు. చదువు ఉచితమే అయినా ఢిల్లీ వెళ్లి హాస్టల్‌లో ఉండడానికి స్థోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య రూ. 25 వేలు అందించారు. ఈసందర్భంగా భూక్య వెంకన్న పొన్నాల లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపాడు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత..



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి, ఆగస్టు 22 : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన గంటా ప్రభాకర్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం బాధిత కుటుంబాన్ని సందర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చెరుకు చంద్రశేఖర్, జిలుకర రాజు, నాయిని మహేష్, బండ రాంచందర్, అంబటి రాములు, దయ్యాల దేవేందర్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి గుడికి శంకుస్థాపన

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 22: స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్ వెనక ఉన్న పురాతన శ్రీ తిరుమల నాథ స్వామి దేవాలయం ఆవరణలో గురువారం ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి ప్రముఖ సిద్ధాంతి బాణాపురం కృష్ణమాచార్యులు భూమి పూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో నిర్మించనున్న ఆలయ శంకుస్థాపనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, రామానుజాచారి, వెంకట నర్సింహాచారి, యాదమ్మ, దాతలు కె.వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, కొలిపాక సతీష్, సునిత, కె.నరేందర్, హేమలత, జి.శ్రీనివాస్, పాలకుర్తి సోమశేఖర్, నాగబండి వెంకట్రాం నర్సయ్య, పి.సత్యనారాయణ, గట్టు ఎల్లయ్య పాల్గొన్నారు.

'మహిళలు స్వయం శక్తితో ఎదగాలి'

రఘునాథపల్లి, ఆగస్టు 22: మహిళలు స్వయంశక్తితో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మండల పశు వైద్యాధికారి అశోక్ సూచించారు. మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా రఘునాథపల్లి, నిడిగొండ క్లస్టర్ పరిధిలోని మహిళ సంఘాల సభ్యులకు పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంపై మండల కేంద్రంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పాడి పశువులతో పాటు పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సారయ్య, సీసీలు భాగ్యలక్ష్మి, ఎల్లస్వామి, స్త్రీనిధి మేనేజర్ రమ్య, స్వరూప, హైమావతి, అరుణ, పావని, శ్రీమతి, రమ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి జోలికెళితే ఉక్కుపాదమే



లింగాలఘణపురంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ

లింగాలఘణపురం, ఆగస్టు 22: గంజాయి జోలికెళితే ఉక్కుపాదం మోపుతామని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ హెచ్చరించారు. గురువారం ఆయన లింగాలఘణపురం పోలీస్‌స్టేషన్‌లో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లుగా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రధానంగా పిల్లల కదలికల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతీ విద్యార్థి బడిలో కేటాయించే సమయం కంటే ఇంట్లో కేటాయించే సమయమే ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు మర్చిపోవద్దని సూచించారు. పిల్లలకు క్రమశిక్షణ నేర్పించే విధానంలో తల్లిదండ్రులు అవసరమైతే ఉపాధ్యాయు లను ప్రోత్సహించాలే తప్ప పిల్లలను వెనుకేసుకురావొద్దన్నారు. ఈజీ మనీ వ్యవహారంలో చాలా మంది మోసాల ఉచ్చులో చిక్కుకుంటున్నారని అలాంటి వాటి పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. మోసపూరిత ఫోన్స్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్‌నేరాల వలకు చిక్కొద్దని సూచించారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డట్లు గమనించిన వెంటనే 1930కి కాల్ చేయడంతో పాటుగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమ సంపాదన కోసం గంజాయి విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఇందుకోసం పోలీస్ శాఖ ప్రత్యేకవిభాగాన్ని ఏర్పాటు చేసి ఊరూరా అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగులు జులాయిగా తిరగకుండా ఉద్యోగాల సాధనపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.